# ఎక్కడ పని చేసిన ప్రజలతో మమేకమవుతూ సమస్యాత్మక కేసులను చాకచక్యంగా ఛేదించాలి



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య (15 సెప్టెంబర్ 2026)** ఎక్కడ పని చేసిన ప్రజలతో మమేకమవుతూ సమస్యాత్మక కేసులను చాకచక్యంగా ఛేదించి పోలీస్ స్టేషన్ కు మంచి పేరు తీసుకురావాలని ఇన్స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డి తెలిపారు. మహేశ్వరం పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వెళ్తున్న ఎస్సై రాఘవేందర్ ను ఇన్స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి శాలువాల, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం అనేది అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకంటే చాలా కీలకమైనదన్నారు. ఇంతకాలం ఇక్కడ చాలా క్రమశిక్షణ పట్టుదలతో పనిచేసి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించడం గర్వకారణ మన్నారు. ఇప్పుడు వెళ్లే చోట కూడా ఇంతకన్నా రెట్టింపు పేరు తెచ్చుకోవాలని సూచించారు. కాలనుగుణంగా సమాజంలో ఎన్ని మార్పులు వస్తున్నాయని సమయాన్ని సందర్భాన్ని బట్టి విధిని నిర్వహించాలని కోరారు.

**భావోద్వేగానికి లోనైన ఎస్సై**

సన్మానం అనంతరం ఎస్సై రాఘవేందర్ మాట్లాడుతూ తన పదవీ కాలంలో తనకు పూర్తి స్థాయిలో సహకరించిన ఉన్నతాధికారులకు, తోటి సిబ్బందికి, అలాగే స్థానిక ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడి ప్రజలు అందించిన సహకారం, చూపిన అభిమానం తన జీవితంలో మరువలేనిదని భావోద్వేగానికి లోనయ్యారు. భవిష్యత్తులో అవకాశం ఉంటే ఇదే ప్రాంతంలో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ప్రసాద్, మారయ్య, జర్నలిస్టులు, పోలీస్ సిబ్బంది, బీఆర్ఎస్ నేత కాడమోని ప్రభాకర్ ముదిరాజ్, సిరిగిరిపురం గ్రామ మాజీ సర్పంచ్ కాసుల సురేష్ , మహేశ్వరం జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## నాగోల్‌లో లైవ్ మర్డర్

**హైదరాబాద్ :** రాజధాని హైదరాబాద్‌లో శాంతిభద్రతలపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బండ్లగూడ ఆనంద్ నగర్ చౌరస్తా సమీపంలో జరిగిన దారుణ హత్య నగరంలో కలకలం రేపుతోంది. ఈ హత్య ఘటనకు సంబంధించిన లైవ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇద్దరు రౌడీషీటర్ల మధ్య నడుస్తున్న పాత కక్షల నేపథ్యంలోనే ఓ గ్యాంగ్ వెంటాడి మరీ రౌడీషీటర్ పై దాడిచేసి, పదునైన వస్తువులతో పొడిచి హత్య జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఖమ్మం జిల్లా ఇల్లెందు పట్టణానికి చెందిన రౌడీషీటర్ మహమ్మద్ నహీమ్ ప్రస్తుతం బండ్లగూడ సహభావన అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. చిన్ననాటి నుంచి కలిసి చదువుకుని, స్నేహంగా మెలిగిన మరో రౌడీషీటర్ ఉమామహేశ్వర్ అలియాస్ జేకే మహేష్ తో గొడవలు ఉన్నాయి. వీరిద్దరిపై ఇప్పటికే పలు హత్య కేసులు ఉండటంతో పాటు ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్లు కూడా ఓపెన్ చేసినట్లు తెలుస్తోంది. సెటిల్మెంట్ల ద్వారా వచ్చిన డబ్బుల పంపిణీ విషయంలో గత 3 నెలలుగా నహీమ్, మహేష్ మధ్య తీవ్రమైన వివాదాలు నెలకొన్నాయి. ఈ వివాదాలు ముదిరి ముఠా కక్షలుగా మారాయి. ఈ ఆర్థిక తగాదాలతో నహీమ్ ను ఎలాగైనా హత్య చేయాలని మహేష్ గ్యాంగ్ ప్లాన్ చేసింది. ఈ క్రమంలో బండ్లగూడ ఆనంద్ నగర్ చౌరస్తా సమీపంలోని బార్ కు రౌడీషీటర్ నహీమ్ వెళ్లగా.. అక్కడికి వచ్చిన మహేష్, అతడి అనుచరులు కలిసి రాడ్లతో కొట్టి, పదునైన వస్తువులతో పొడిచి అంతా చూస్తుండగానే దారుణంగా హత్య చేశారు. సోమవారం రాత్రి దాదాపు 9 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. సమాచారం అందుకున్న నాగోల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు మహేష్, అతడి అనుచరుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపి తీవ్రంగా గాలిస్తు న్నారు. కాగా, మల్కాజ్‌గిరి సీసీఎస్ పోలీసులు ప్రధాన నిందితుడు ఉమామహేశ్వర్‌తో పాటు మరో ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. హత్యకు ఉపయోగించిన ఆయుధాలతో పాటు, వారి వాహనాన్ని సీజ్ చేసి విచారణ చేపట్టారు

## కేటీఆర్ పీఏపైదాడి నిజం కాదు

**హైదరాబాద్ :** నగరం నడిబొడ్డున ఉన్న సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లోకి ఏకంగా 15 మంది చొరబడి తన పీఏ మహేందర్ రెడ్డి, పీఆర్వో మహేష్‌లపై మూకుమ్మడిగా దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో రౌడీల రాజ్యం, గుండాల రాజ్యం నడుస్తోందని మండిపడ్డారు. ఈ దాడి కాంగ్రెస్ కార్యకర్తలు చేశారా లేక మఫ్టీలో ఉన్న పోలీసులకే ముసుగులు వేసి చేయించారా తేలాలంటే వెంటనే సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్షసాధింపుతో పెట్టిన కేసులో విచారణ పేరుతో స్టేషన్‌కు పిలిపించి, ఖాకీల సమక్షంలోనే ఈ దాడి చేయించడం వెనుక ముమ్మాటికి సీఎం రేవంత్ రెడ్డి హస్తం ఉందని కేటీఆర్ ఆరోపించారు. ఉదయమే విచారణకు రమ్మని చెప్పి రాత్రి వరకు కాలయాపన చేయడాన్ని బట్టి చూస్తే, ముందస్తు కుట్ర ప్రకారమే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని అన్నారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం తమ సిబ్బందిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశాలు ఉన్నప్పటికీ, కక్ష పూరితంగానే దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. హోంమంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఘటనకు పూర్తి బాధ్యత వహించాలని కేటీఆర్ అన్నారు. పీఆర్వో మహేష్, పీఏ మహేందర్ రెడ్డిలకు వెంటనే తగిన రక్షణ కల్పించి మెరుగైన వైద్య చికిత్స అందించాలని, అలాగే పోలీస్ స్టేషన్ లోపల, వెలుపల ఉన్న సీసీటీవీ ఫుటేజీని తక్షణమే భద్రపరచాలని డిమాండ్ చేశారు. ఈ అరాచకానికి పాల్పడిన కాంగ్రెస్ రౌడీలను గుర్తించి కఠినంగా శిక్షించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్ పీఆర్వో మహేష్, పీఏ మహేందర్‌రెడ్డిలపై ఎలాంటి దాడి జరగలేదని ఖైరతాబాద్ జోన్ డిసిపి శిల్పవల్లి క్లారిటీ ఇచ్చారు. వారిపై దాడి జరిగిందంటూ సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఆమె తేల్చి చెప్పారు. ఈరోజు ఉదయం వారిపై నమోదైన కేసు విచారణలో భాగంగానే పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఘటనపై డీసీపీ వివరించారు. స్థానికంగా ఉండే కొందరు యువకులు వినాయక చవితి సందర్భంగా గణేష్ మండపం వద్ద డీజే ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి (పర్మిషన్) కోరుతూ సాయంత్రం వేళ పీఎస్‌కు వచ్చారు. అయితే డీజేకు అనుమతి నిరాకరిస్తూ సైఫాబాద్ సీఐ వారితో కొద్దిగా దురుసుగా మాట్లాడారు. ఆ సమయంలో అక్కడే ఉన్న కేటీఆర్ పీఆర్వోను ఆ యువకుల్లో ఒకరు గుర్తించి.. అసెంబ్లీ వద్ద న్యూసెన్స్ చేసిన వాళ్లనేమో పీఎస్‌లో మర్యాదగా కూర్చోబెట్టి మాట్లాడతారు, మాకేమో పర్మిషన్ ఇవ్వరా అని వారితో వాగ్వాదానికి దిగినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన సీఐ అలా మాట్లాడకూడదని ఆ యువకులను వారించడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారని ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని సమగ్రంగా పరిశీలించామని, ఎలాంటి భౌతిక దాడి జరగలేదని ఆమె స్పష్టం చేశారు. అయితే ఈ ఘటనపై బీఆర్ఎస్ నేతలు దాడి జరిగిందంటూ ఫిర్యాదు చేశారని, దానిపై విచారణ జరుపుతున్నామని ఆమె తెలిపారు.

## ఆసిఫాబాద్ నియోజకవర్గంలో పర్యటించిన కోవ లక్ష్మి

**ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలోని నార్నూర్, గాదిగూడ మండలాల అభివృద్ధికి మరియు స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి ఆమె సోమవారం నార్నూర్ మండలంలోని జామాడ, బలాన్‌పూర్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు, పంచాయతీ భవనాలను ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రారంభించారు. మండలాల్లోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. 'భూ భారతి' కార్యక్రమంలో భాగంగా అర్హులైన రైతులకు కోవ లక్ష్మి భూ హక్కు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి మాట్లాడుతూ... నార్నూర్, గాదిగూడ మండలాల్లో నెలకొన్న ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ప్రత్యేక

## గంగారం ప్రభుత్వ స్కూల్లో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ పంపిణీ



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య (15 సెప్టెంబర్ 2026)** గంగారం గ్రామపంచాయతీ గవర్నమెంట్ స్కూల్లో గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూలు యూనిఫామ్ ,టై, షూ అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్ నాయక్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, వారిపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తోందని తెలిపారు. ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన వస్త్రంతో కూడిన రెండు జతల యూనిఫామ్‌లను, వాటితో పాటు బూట్లు, సాక్సులు, టై ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. విద్యార్థులందరూ ఒకే విధమైన దుస్తులు ధరించడం వల్ల వారిలో సమానత్వ భావం, క్రమశిక్షణ పెరుగుతాయని పేర్కొన్నారు గవర్నమెంట్ ఇచ్చే పథకాలు ఇచ్చినవి ఉపయోగించుకోవాలని, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఉండే విధంగా భవిష్యత్తులో ఏర్పాటు చేయబోతున్నారన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత త స్థాయిలో పిలవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేందర్, వార్డు మెంబర్ రవి, పద్మాదేవ మోహన్ స్కూల్ టీచర్ సురేష్, డ్వాక్రా గ్రూప్ సంఘం మంజుల తదిథతులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య (15 సెప్టెంబర్ 2026)** పేదలకు తెలంగాణ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు జల్ పల్లి సర్కిల్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ షేక్ జహంగీర్ తెలిపారు. జల్ పల్లి 65 డివిజన్ లో మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు జల్ పల్లి శ్రీరామ్ కాలనీలో జహంగీర్, స్థానిక మాజీ కౌన్సిలర్ కెంచె లక్ష్మీనారాయణతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సులభతరం చేయడానికి ఈ కార్డులను అందజేస్తోందని, దీనివల్ల రేషన్ పంపిణీ ప్రక్రియ వేగంగా, సులభంగా జరుగుతుందని వారు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ కాలనీ మాజీ కౌన్సిలర్ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల శ్రీనివాస్, బాబు , రంగారెడ్డి జిల్లా చేనేత విభాగ అధ్యక్షుడు మస్న రవి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాలాజీ, ప్రవీణ్ గౌడ్, మల్లు, జీహెచ్ఎంసీ సిబ్బంది, సూపర్వైజర్ బుడుమాల కుమార్ పాల్గొన్నారు.

## ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదం.. నిందితులను అరెస్ట్ చేయొద్దన్న హైకోర్టు

**హైదరాబాద్ :** తెలంగాణ ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయొద్దని ధర్మాసనం ఆదేశించింది. కేవలం నోటీసులు ఇచ్చి దర్యాప్తు కొనసాగించాలని పోలీసులకు స్పష్టం చేసింది. ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద కేసులు నమోదైనప్పుడు నిందితులను ఎలా అరెస్టు చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని గుర్తుచేసింది. వాటిని పక్కనపెట్టి అరెస్టులకు ఎలా వెళతారని పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని హెచ్చరించింది. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి ప్రాంతంలో కాంగ్రెస్ నిర్వహించిన నిరసన కార్యక్రమం తర్వాత ఈ వివాదం మొదలైంది. నిరసన జరిగిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నేతలు, స్థానికుల ఫిర్యాదులతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టారు. నిందితులను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో వారిలో కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన ధర్మాసనం.. నిందితుల అరెస్టుపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. తదుపరి చర్యలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని పోలీసులను ఆదేశించింది.

## పాటిమట్లలో ఘనంగా సాయుధ పోరాట అమరవీరులకు నివాళులు



**మన తొలివెలుగు । మోత్కూర్ :** ంనిజాం నిరంకుశపాలన అణచివేత, దోపిడీ, వెట్టిచాకిరీ విముక్తికై అగ్నిజ్వలలా సాగిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించాలనే బీజేపీ విధానాలను తిప్పికొట్టాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు పిలుపునిచ్చారు. సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా మంగళవారం మోత్కూర్ మండలం పాటిమట్ల గ్రామంలో అమరవీరుల స్తూపాలకు నివాలర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలన భూస్వాముల దోపిడీ వెట్టిచాకిరీ అణచివేతలకు వ్యతిరేకంగా రైతులు వ్యవసాయకూలీలు పేదప్రజలు ఐక్యంగా కలసి పోరాడారని గుర్తుచేశారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం దేశ చరిత్రలోనే గొప్ప ప్రజా పోరాటమని అన్నారు. అలాంటి పోరాటాన్ని ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువులు చేసిన పోరాటంగా సెప్టెంబర్ 17 విమోచన దినంగా బీజేపీ వక్రీకరించే ప్రయత్నం చేస్తుందని అన్నారు. భూస్వాములు జాగిర్దారులు హిందూ దొరలే, హిందూ ప్రజలను పీల్చి పిప్పి చేశారని, నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అకృత్యాలపై కులమతాలకు అతీతంగా ముస్లింలైన మహమ్మద్ ముఖ్దుమ్ మోహినొద్దీన్, షేక్ బందగీ, షాయభుల్లాఖాన్ లాంటి అనేక మంది పోరులో అమరులై వారి బలిదానాలతో సాయుధపోరాటం విజయవంతమైందని, 1948 సెప్టెంబర్ 17 న భారత్ లో విలీనమైందని అన్నారు. అలాంటి పోరాటంతో ఏలాంటి సంబంధం లేని వారు చరిత్రను వక్రీకరిస్తూ మతం రంగుపులిమితే చరిత్ర క్షమించదని హెచ్చరించారు. భూమికోసం, బుక్తికోసం, వెట్టిచాకిరీ విముక్తికోసం సాగిన పోరాటంలో ఎందరో కమ్యూనిస్టులు అమరులయ్యారని, వారి పోరాట స్మృతులు నేటికీ అనేక గ్రామాలలో స్తూపాలుగా ప్రత్యేక సాక్షాలుగా ఉన్నాయని అన్నారు. వారి త్యాగాలను పోరాటలను నేటి తరాలకు తెలిసేవిధంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, రాచకొండ కనకయ్య, కురిమేటి సోమయ్య, బండి రవి, తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్ ప్రసిద్ధ గణేశుని దర్శించుకున్న మాజీ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య (15 సెప్టెంబర్ 2026)** మహేశ్వరం నియోజకవర్గం, జీహెచ్ఎంసీ పరిధిలోని బాలాపూర్ గణేష్ ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రసిద్ధ బాలాపూర్ గణేశుని మొదటి పూజ మహోత్సవం సందర్భంగా మాజీ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి విఘ్నేశుడిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు వారిని సత్కరించారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ వినాయక చవితి ఆశీస్సులతో సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు , ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వేడుకున్నారు. బాలాపూర్ గణేష్ ఉత్సవాల ప్రాముఖ్యతను కొనియాడుతూ, పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## కే. ఎల్.ఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన చింతకింది నవీన్ గౌడ్



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య (15 సెప్టెంబర్ 2026)** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడుగా బాలాపూర్ మండలం జల్ పల్లి గ్రామానికి చెందిన చింత కింది నవీన్ గౌడ్ ఎన్నికైన సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా నవీన్ గౌడ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి తాను శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు గొప్ప వరం



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య (15 సెప్టెంబర్ 2026)** ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఒక గొప్ప వరమని మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. జల్ పల్లి సర్కిల్ పరిధిలోని శ్రీరామ కాలనీకి చెందిన సురేఖ శీలావంత్ ఇటీవల ప్రైవేట్ ఆస్పత్రిలో గుండెకు సంబంధించి ఆపరేషన్ చేయించుకుంది. ఆర్థికంగా ఇబ్బందులు ఉండడంతో స్థానిక మాజీ కౌన్సిలర్ పల్లపు శంకర్ ద్వారా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేయించారు. వచ్చిన 60 వేలకు సంబంధించిన చెక్కును ఆమె కుటుంబ సభ్యుడు సిద్దు కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్ దవాఖానలో వైద్యం చేయించుకో లేని పేదలకు సీఎం సహాయ నిధి వరంగా మారిందన్నారు. తీవ్రమైన అనారోగ్యాలు, ప్రమాదాల బారిన పడి ప్రైవేటు ఆసుపత్రులలో ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేద కుటుంబాలకు ఈ నిధి ద్వారా ఆర్థిక సాయం అందుతుందన్నారు. పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

